# వడిసెల

## - వక్కంతం సూర్యనారాయణ రావ్

చప్పుడు చేస్తూ గేటు మూసుకుంది.

ఆ చప్పుడులో గేటు మూసిన వ్యక్తి కోపం స్పష్టంగా ధ్వనించింది. పక్కకి జరిగి, బలహీనంగా గోడకి వీపు ఆన్చిన పగడం అలాగే నిలబడింది. ఆమె కడుపులో ఏవో ఉక్కు గోళ్ళు ఆకలిగా రక్కుతున్నాయి. ఆమె గుండెలో కండచీమలు కసిగా కుట్టడం ప్రారంభించాయి. కదిపిన పుట్టలోంచి కందిరీగల్లా ఆమె లోంచి ఏవో ఆలోచనలు లేస్తున్నాయి.

నిస్సహాయత, నీరసం, ఆ రెండింటినీ మింగేస్తూ ఏదో అవమానం. ఆ అవమానం ఆ రెండింటినీ మరిచిపొమ్మంటోంది. అయితే... అణువు రూపంలో తన కడుపులో పుట్టి, విశ్వరూపం ధరించిన ఆకలి, అవమానాన్ని మరిచిపొమ్మంటోంది.

ఆకలి మాట నెగ్గింది.

పగడం గోడనుంచి దూరంగా జరిగింది. మెల్లిగా తనవైపు పైకి లేస్తున్న నేలని బైర్లు కమ్ముతున్న కళ్ళతో చూస్తూ మళ్ళా గోడకి జార్లాబడింది. నేల మెల్లిగా కిందికి తగ్గింది. ఇన్నేళ్ళ అడుక్కుతినే వృత్తిలో తను రక రకాల తిట్లు తింది. కానీ, ఇందాకటి తిట్లు... వణుకుతున్న కాళ్ళు ఆమెని కూచోమంటున్నాయి. ఆకలి ఆమెని కదలమంటోంది; మరోచోటికి నడవమంటోంది.

మళ్ళా ఆకలి మాట నెగ్గింది. పగడం కదిలింది.

ఆమె పెద్ద పెద్ద కళ్ళు ఇరువైపులా ఉన్న గుమ్మాల్ని ఆశగా, ఆత్రంగా చూస్తున్నాయి. అవును, పుట్టినప్పట్నించీ ఆకలిగా, ఆశగా, ఆత్రంగా లోకాన్ని చూసీ, చూసీ పగడం కళ్ళు పెద్దగా అయ్యాయి. ఆకలినే ఆహారంగా నిండుగా నింపుకున్న ఆమె కడుపు అరచేతిలా పల్చగానే ఉండిపోయింది.

నీరసంగా అడుగులేస్తున్న పగడం కళ్ళు మెరిశాయి. దాదాపు వీధి చివరకి చేరుకున్నాక తెరిచిన గుమ్మం ఆమెకి కనబడింది. మూసిన తలుపుల్ని తెరిపించడం తనలాంటి వాళ్ళకి అసాధ్యమని ఆమెకి తెలుసు.



(ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక సౌజన్యంతో)

అప్రయత్నంగా ఆమె కుడివేపుకి తిరిగింది. గేటు ముందు ఆగింది. ఇందాకటి గేటు లోపల జరిగినదంతా ఆమెకి తటాలున గుర్తొచ్చింది.

తెరిచిన గేటు దాటి లోపలి వెళ్ళినందుకూ, గోరుముద్దలు తింటున్న చంటాణ్ణి 'దిష్టిచూపులు' చూసినందుకూ ఆ 'తల్లి' అన్న మాటలు పగడం చెవుల్లో గింగురుమన్నాయి. గోరుముద్దని చిన్ని నాలుకతో ఇవతలికి తోసేస్తూ నవ్వుతున్న కుర్రాణ్ణి తను ముచ్చటగా చూసింది. దిష్టి తగిలేలా చూడలేదు.

ఆ తల్లి మాటలు తనని ఆకలికన్నా అధికంగా బాధపెట్టాయి. ఆకలి కడుపుని రణంగా చేస్తుంది. ఆ తల్లి మాటలు తన మనసుని రణంగా చేశాయి.

పగడం గేటు దాటే ప్రయత్నం చేయలేదు. అన్నం బదులు అవమానం దొరుకుతుందేమో? మళ్ళీ మెల్లిగా తలెత్తుతున్న అవమానం ఆమెని వెనుదిరిగి వెళ్ళమంటోంది. ఆకలి గేటు దాటి తెరిచిన గుమ్మం ముందుకు వెళ్ళమంటోంది. ఈ సారీ ఆకలి మాటే నెగ్గింది.

గేటు దాటబోతున్న పగడం కళ్ళు మెరిశాయి. ఇంటావిడ లోపలి గుమ్మం దాటి ముందు గుమ్మంవైపు వస్తోంది. పగడం అప్రయత్నంగా ఆగింది. ఇంటావిడ చేతిలో ప్లాస్టిక్ పళ్ళెం. పళ్ళెం నిండుగా అన్నం. ముఖ్యంగా... ఆమె మొహంమీద చిరునవ్వు!

"అమ్మా!" అసంకల్పితంగా, ధైర్యంగా పగడం పిలిచింది. గిన్నె పట్టుకున్న చెయ్యి ముందుకు సాగింది.

జవాబుగా "భౌ ! భౌ ! భౌ !" అంటూ జాతికుక్క అరుపులు వినిపించాయి.

ఇంటావిడ కళ్ళు తటాలున గేటువైపు చూశాయి. ఆమె మొహం మీది చిరునవ్వుని రెప్పపాటులో ఏదో అదృశ్యహస్తం తుడిచేసింది.

వరండా చివరికి జరిగి, పగడంవైపు చూస్తూ ఎత్తుగా బలంగా ఉన్న జాతి కుక్క భీకరంగా మొరగసాగింది. దాన్ని లాగిపట్టిన గొలుసు తెగిపోతుందేమో అన్న భయం పగడాన్ని వెనక్కి జరిపింది.

'అన్నం లేదు, సున్నం లేదు, దయచేయ్' అంటూ కసురుకోడానికి తన యజమానురాలికి అవకాశం ఇవ్వకుండా, ఆ పని తానే చేస్తున్నట్టు జాతికుక్క చెవులు చిల్లులు పడేలా అరుస్తోంది.

"రాజా...!" ప్రేమా, మందలింపూ కలిపి అంటూ ఇంటావిడ గుమ్మం దాటి వరండాలో ఆగింది.

(ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక సౌజన్యంతో)

www.sirimalle.com

రాజా ఆమెవైపు తిరిగి ప్లేటువైపు ఎగురుతూ, శ్రుతి మార్చి అరవసాగింది. రాజా తలమీద చేతిని వేసి, ప్లేటుని గోడవారగా పెట్టేసి, ఇంటావిడ గుమ్మం దాటింది. వెనక్కి తిరిగి, అసహ్యంగా పగడం వైపు చూసి నిర్లక్ష్యంగా తలుపు మూసేసింది.

ఆదరాబాదరా అన్నం బొక్కుతున్న 'రాజా' ఏదో గుర్తొచ్చినట్టు తినడం మానేసి, గేటువేపు చూస్తూ బెదిరింపుగా మొరగసాగింది. తనకి పోటీగా నించున్న పగడం కళ్ళలోకి రాజా ఎర్రటి కళ్ళు ఆగ్రహంతో చూస్తున్నాయి.

"భౌభౌ ! భౌభౌ ! ఫోఫో ! ఫోఫో !' అని తనకి వినిపిస్తున్న కుక్క అరుపుల్ని పగడం జాలిగా వింటూ వెనక్కి తిరిగింది. జాతి కుక్క ఉన్న ఇంటావిడ తీరు ఇందాకటి ఇంటావిడ తిట్లని ఎక్కడికో తరిమేసింది. ఈవిడ మౌనం ఆవిడ అరుపులకన్నా దారుణంగా అనిపించింది పగడానికి.

కడుపులో ఏదో రంగుల రాట్నం తిప్పుతున్న ఆకలి ఆమెని ఇంకా ముందుకి నడవమంది.

బాల్కనీమీద నుంచి అటూ ఇటూ చూసిన శశికాంత్ అసహనంగా పచార్లు ప్రారంభించాడు. నిరీక్షణలో గడిచిపోయిన రెండు గంటలూ అతన్ని ఆశ్చర్యంలో ముంచేస్తున్నాయి. కలా? నిజమా? నిజంగా ఇండియాలో – పోనీ, ఈ ఊళ్ళో అడుక్కుతినే వాళ్ళు లేరా? లేకపోతే, రాత్రికి రాత్రే బిక్షగాళ్ళందర్నీ కార్పొరేషన్ వాళ్ళు మరెక్కడికైనా తరిమేశారా? ఊహూఁ... రోజులాగే ఈ రోజు ఎవడో అడుక్కుతినేవాడి కంఠమే తనకి మేలుకొలుపు పాడింది.

ఆశ్చర్యాన్ని విసుగ్గా మార్చుకుంటూ శశికాంత్ సిగరెట్ వెలిగించాడు. అప్రయత్నంగా అతని కళ్ళు కుర్చీకింద పెట్టిన అన్నం పొట్లాలమీద పడ్డాయి. ఆ అన్నాన్ని ఆరగించబోయే బిచ్చగాడి కోసం తను ఆత్రంగా నిరీక్షిస్తున్నాడు; పూర్వం రోజుల్లో-జనాభా తక్కువగా ఉన్న రోజుల్లో-అతిథి కోసం నిరీక్షించిన గృహస్థుస్థులా!

నవ్వుకుంటూ ఆగి, శశికాంత్ రోడ్డు మీదికి చూశాడు. కింద చెత్తకుండీ పక్కనే బూడిద మీద ఆ కుక్క ఇంకా పడుకునే వుంది. అది అలాగే, అక్కడే పడుకునే ఉంటుంది. అది దాని పర్మనెంట్ స్థానం.

సిగరెట్ పీకని గిరాటేసి శశికాంత్ మళ్ళా పచార్లు ప్రారంభించాడు. అడుక్కు తినేవాళ్ళు లేని ఆ వీధి అతని కళ్ళకి వెలబోతూ కనిపిస్తోంది. చనిపోయిన, లేదా – హత్యకు గురి అయిన ఏ రాజకీయ నాయకుడి పేరుతో ఎవరైనా పెద్ద ఎత్తున అన్నదానం చేస్తున్నారా?

www.sirimalle.com

(ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక సౌజన్యంతో)

ఆలోచిస్తూ అతను వీధి మలుపు వేపు చూశాడు. అతని కళ్ళు మెరిశాయి. అప్రయత్నంగా కళ్ళు మూసి, తెరిచి, మళ్ళీ చూశాడు.

నిజమే! ఎవరో బిచ్చగత్తె వీధిలోకి వస్తోంది. బిచ్చగత్తేనా? సందేహం లేదు! ఎండిపోయిన జుట్టు, మాసిన గుడ్డలు, ముఖ్యంగా... ఆమె చేతిలోని గిన్నె, ఆమె బిచ్చగత్తె అని చాటింపు వేస్తున్న చిన్న నగారాలా ఉంది. శశికాంత్ తృప్తిగా నిట్టూర్చాడు.

ఆమె వైపే చూస్తూ బాల్కనీలో స్తంభంలా నిలబడ్డ శశికాంత్ లో ఉన్నట్టుండి ఏదో సందేహం పుట్టుకొచ్చింది. ఈ ఇంటివాళ్ళైనా ఆమెకి అన్నం పెట్టేస్తారా? పెట్టేస్తే..? పెట్టేస్తే ఆ పిల్ల ఇక్కడి కొస్తుందా? వచ్చినా.. ఏ ఇల్లాలూ ఆ పిల్లకి అన్నం పెట్టకూడదని అతను అప్రయత్నంగా లోపల్లోపలే ప్రార్థించాడు.

థాంక్ గాడ్... అటూ ఇటూ చూస్తూ ఆ పిల్ల మెల్లిగా, తిన్నగా వస్తోంది. శశికాంత్ రెప్పపాటు లేని కళ్ళతో చూస్తున్నాడు. సన్నటి ఆకారం... సన్నటి నడుం, ఎండిపోయినా కూడా పొడుగ్గా ఉన్న వెంట్రుకలు, చిరిగిన పైటలోంచి ఎర్రగా, ఎత్తుగా అవుపిస్తున్న జాకెట్టు, అడుక్కుతినే పిల్లైనా అందంగానే ఉంది. అదృష్టం... అందమైన అడుక్కుతినే పిల్లే వస్తోంది.. తనకోసం...

తన ముందు నడుస్తున్న సన్నటి పొడుగాటి నీడను పగడం అదోలా చూసింది. తన నీడ అందంగా అవుపిస్తోంది. నీడలాగే తను అందంగా ఉందా? తను చక్కని చుక్క అని అయ్య – తనని ఒంటరిగా లోకానికి, ఆకలికి వదిలేసి, ఆకలి చావు చచ్చిన అయ్య – తరచుగా అనేవాడు! అప్పుడెప్పుడో తన దగ్గరున్న చిన్న అద్దం ముక్కలో తన అందాన్ని పూర్తిగా చూసుకోలేకపోయింది తను. తన దగ్గర తన అందాన్ని పూర్తిగా చూపించే అద్దం లేదు.

పగడం మెదడులో ఏదో తళుక్కుమంది. తన దగ్గర అద్దం లేకపోయినా తన అందాన్ని తను చాలాసార్లు స్పష్టంగా చూసుకుంది. గడప గడపకీ ఆకలితో వెళ్ళే తనని ఆకలిగా చూసే మగాళ్ళ కళ్ళలో, ఆ కళ్ళ అద్దాల్లో తన అందాన్ని చాలాసార్లే చూసుకుంది.

అప్రయత్నంగా నవ్వుకుంటూ పగడం నడవసాగింది. ఒక్కసారి..ఒకే ఒకసారి తనకి దొరికితే చాలు. తరవాత సంగతి తరవాత. ఒకసారి కడుపునిండా అన్నం తిన్నాక తను చచ్చిపోయినా పర్వాలేదు. ఆకలితో చావడం తనకి ఇష్టం లేదు.

దగ్గరగా వచ్చేస్తున్న ఆ పిల్లని చూస్తూ శశికాంత్ ఆదరాబాదరా ఒక అన్నం పొట్లం అందుకున్నాడు. ఆ పొట్లాన్ని కొద్దిగా విడదీస్తూ పిట్టగోడమీద వంగాడు.

"అమ్మీ.. ఇందా!" బిగ్గరగా ధ్వనించిన తన కంఠంలోని ఆత్రుత అతనికే ఆశ్చర్యాన్ని కలిగించింది.

తటాలున ఆగి పగడం ఆత్రంగా తలతిప్పి చూసింది. ఆమె చూపులు శబ్దాన్ని వెంటాడుతూ పైకి లేచాయి. పైన నవ్వు మొహం, రెండు చేతుల్తో పట్టుకున్న పొట్లం. ఆశ పగడం మొహానికి కొత్త రంగును పులిమింది. ఆత్రంగా రెండు చేతుల్ని చాచిందామె. గిన్నె రెండు చేతుల మధ్యా ఇరుక్కుంది.

శశికాంత్ చేతులు ఇంకొంచెం ముందుకు సాగాయి. గురిచూసి పొట్లాన్ని కిందికి వదిలాడతను. గురి తప్పకుండా పొట్లం చెత్తకుండీ పక్కనే పడి, మెత్తగా చప్పుడు చేసింది.

తన చేతుల్ని తప్పించుకుంటూ కింద పడిన పొట్లం వేపు పగడం గబాల్న తిరిగింది. ఆమె గుండె దడ దడ కొట్టుకుంది. ఏదో ఆవేదన వెల్లువలా ఆమెలోంచి పైకి తన్నుకొచ్చింది. ఆమె కన్నా వేగంగా, మెరుపులా కదిలిన కుక్క పొట్లంలోకి మూతిని దోపేసి ఆవురావురంటూ తింటోంది.

పగడం కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఇందాక గొలుసుతో కట్టిన జాతి కుక్క తనతో పోటీపడి గెలిచింది. ఇప్పుడు వీధికుక్క తనతో పోటీపడి ఓడించింది. దిగులుగా, దీనంగా తల పైకెత్తి కన్నీళ్ళగుండా అతన్ని చూసింది పగడం. పైనుంచి అతను నిరుత్సాహంగా చూస్తున్నాడు.

"బాబు!" అప్రయత్నంగా, బొంగురుగా అంది పగడం. అందినట్టే అంది కుక్క పాలైపోయిన అన్నం ఆమె ఆకలిని కోటి రెట్లు పెంచింది.

శశికాంత్ వెనక్కి జరిగాడు. క్షణంలో మరో పొట్లంతో ప్రత్యక్షమయ్యాడు. "ఈసారి జాగ్రత్తగా పట్టుకో!".

కిందికి దిగి అన్నం తనకి అందిమ్మని అడిగే అవకాశం లేని పగడం ఆదరాబాదరా చీరచెంగుని రెండు చేతులతో వెడల్పుగా పట్టుకుంది. ఆమె కళ్ళు ప్రాధేయపూర్వకంగా, మౌనంగా అడుక్కుంటున్నాయి.

శశికాంత్ మళ్ళీ గురిచూసి పొట్లం వదిలాడు. గురితప్పకుండా పొట్లం మళ్ళీ చెత్తకుండీ పక్కనే పడింది.



(ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక సౌజన్యంతో)

పగడం మెరుపులా కదిలింది. పొట్లం ముందు తటాలున కూలబడింది. ఆమె చెయ్యి పాము పడగలా పొట్లం వైపు దూసుకెళ్లింది. మొదటి కోటా అప్పటికే ముగించిన కుక్క రెండో పొట్లం మీదికి అదే క్షణంలో దూకింది. పగడం చేతినీ, అన్నాన్నీ కలిపి తన నోటితో బిగించింది. పగడం కళ్ళముందు ఏదో మెరిసింది.

పగడం ఎడమ చెయ్యి చివాల్న కదిలింది. ఆమె చేతిలోని గిన్నె కుక్క తలమీద చప్పుడు చేసింది. పట్టు వదిలి "కుయ్" మంటూ కొంచెం వెనక్కి తగ్గిన కుక్క మళ్ళా విజృంభించింది. గిన్నెతో ఆపకుండా మోదుతూ, కుడిచేత్తో అన్నం పొట్లాన్ని లాగడానికి పగడం ప్రయత్నించింది. అదిలింపులకీ, దెబ్బలకీ అలవాటుపడిపోయిన కుక్క మొండిగా ముందరి కాళ్ళని కాగితం మీద ఆన్చి నోటితో లాగసాగింది. కాగితం చిరిగింది. కుక్క దూరంగా జరిగింది. పగడం కళ్ళముందు ఏదో వెలుతురు తళుక్కుమంది.

కడుపుకోసం రెండు ప్రాణుల మధ్య జరిగిన పోరాటం అయిపోయింది. నాలుగు కాళ్ళ ప్రాణి గెలిచింది. రెండు కాళ్ళ ప్రాణి ఓడిపోయింది.

కుక్క పళ్ళు సన్నగా గాటు చేసిన చేతి వెనక భాగాన్ని చూస్తూ, పగడం పిడికిలి పైకెత్తింది. ఆమె చూపులు కుక్కవైపు-శత్రువు వైపు తిరిగాయి. అన్నం మెతుకుల మీదా, కాగితం మీదా, భద్రంగా కాళ్ళని ఆన్చుకున్న కుక్క తినకుండా గుర్రుగా చూస్తోంది. నల్లటి మోహంలో ఎర్రటి కళ్ళు నెత్తురు ముద్దల్లా ఉన్నాయి. ఆ కళ్ళల్లో కోపం, వికృతంగా అవుపిస్తున్న తెల్లటి పళ్ళలో అసహ్యం, ఆ కళ్ళూ, పళ్ళూ పగడంలో భయం బదులు అసహ్యాన్ని పుట్టించాయి.

రెండురోజులుగా తనలో ప్రళయం సాగిస్తున్న ఆకలి తనని పిచ్చిదానిగా మార్చేసింది. కుక్కతో తనూ పోటీ పడింది. కుక్క తనతో పోటీ పడింది. కుక్కతో తను పోట్లాడింది. పిడికెడు తిండి కోసం!

పగడంలోని ఆకలి మంట ఆగ్రహంగా మారింది. ఆమె శరీరం వణకడం ప్రారంభించింది. పిడికిట్లో ఉన్న మెతుకుల్ని కసిగా విసురుగా తన వైపు పళ్ళికిలిస్తున్న కుక్క మీతికి విసిరికొట్టింది. గుర్రుమంటూ వెనక్కి తగ్గి, చెవుల్ని పటపటలాడిస్తూ తల విదిల్చింది కుక్క. మళ్ళా ఏదో తళుక్కుమంది.

కుక్క తన విజయాన్ని గ్యారెంటీ చేసుకుని బొక్కడం ప్రారంభించింది.

పగడం అసహ్యంతో, ఆగ్రహంతో, ఓటమితో మెల్లిగా తలెత్తి పైకి చూసింది.

www.sirimalle.com

*(ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక సౌజన్యంతో)*

యువకుడి మొహంలో, కళ్ళలో ఏదో సంతృప్తి. ఆకలి తీరేలా అన్నం తిన్నాక అవుపించే తృప్తి! అతని మెడలోంచి నల్లటి కెమెరా వేలాడుతోంది. కెమెరాతో ఏంచేస్తారో పగడానికి తెలుసు. ఇందాకటి మెరుపులకి అర్థం చిటికెలో తెలిసిందామెకి. కుక్క మీదా, తన మీదా, తన కుక్క బతుకు మీదా ఆమెలో చెలరేగిన కోపం ఆమెలోంచి జారుకుంటోంది. ఇందాకటి కెమెరా మెరుపుల్ని వెక్కిరిస్తూ ఏవో మెరుపులు ఆమెలో తళుక్కు, తళుక్కుమంటున్నాయి.

కుక్కని పూర్తిగా మరిచిపోయి పగడం మెల్లిగా పైకి లేచింది. ఆకలిని కూడా మరిచిపోయిన ఆమె మొహం మీద చిరునవ్వు ప్రత్యక్షమైంది.

"నన్ను..నన్ను..బొమ్మ తీశారా బాబూ?" ఏదో ఆశ ఆమె కంఠాన్ని వణికించింది.

శశికాంత్ ధారాళంగా చిరునవ్వు నవ్వుతూ తలాడించాడు. పగడం ఉత్సాహంగా కొంచెం ముందుకు జరిగింది.

"బాగా పడ్డానా?"

"భలేగా పడ్డావ్?"

"కుక్కతో కాట్లాడినప్పుడు బొమ్మ లాగారా?" పగడం అమాయకంగా అడిగింది.

శశికాంత్ నవ్వుతూ తలాడించాడు.

"బాబూ ఒకసారి కిందకి రాండి. కుక్కతో పోట్లాట బాగోదు. ఇలా నించుంటాను. ఓ బొమ్మ లాగండి. లాగుతారా?" తల బాగా పైకెత్తి ఆశగా అడిగింది పగడం.

శశికాంత్ ఆమెని సానుభూతితో చూశాడు. పాపం ఆ పిల్ల సమయానికి పిలవకపోయినా వచ్చింది. అడక్కపోయినా పోజిచ్చింది. నవ్వుతూ అతను కిందికి దిగాడు.

అతన్ని చూస్తూ పగడం చిందరవందరైన జుట్టుని ఆదరాబాదరా సర్దుకుంది. చీర చెంగుతో మొహం తుడుచుకుంది. చిరిగిపోయిన పైటని ఎడమవైపుకి లాగింది. కుడివైపు జాకెట్టు ఎర్రగా, కొంచెం ఎత్తుగా ప్రత్యక్షమైంది. సిగ్గుతో సర్దుకోబోయింది పగడం.

"ఫరవాలేదు. అలాగే ఉంచు." శశికాంత్ తటాలున అన్నాడు.

(ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక సౌజన్యంతో)
www.sirimalle.com

అతన్ని సిగ్గుతో, చిరునవ్వుతో చూస్తూ పగడం రెండు చేతుల్ని తన వెనక్కి జరిపింది. సత్తు గిన్నెను వెనక దాచుకుందని శశికాంత్ చిరునవ్వుతో గమనించాడు.

కెమెరాని పైకెత్తి, లెన్స్ గుండా చూశాడు. కొంచెం దూరంగా జరిగాడు. ఆ పిల్ల బొమ్మలా వుంది. మొహం మీద సిగ్గు. సిగ్గుతో కొద్దిగా విచ్చుకున్న పెదవులు. చాలీచాలని పైటని పైకి తోస్తున్న ఎర్ర జాకెట్టు..

శశికాంత్ వేలు కదిలింది. కెమెరా ఆమెవైపు కన్నుగీటింది. కెమెరాని కిందికి వదిలి అతను ఆమెను నవ్వుతూ చూశాడు.

"బాగా పడ్డానా బాబూ?" పగడం సిగ్గుపడింది.

"ఏదీ ఒకసారి చూస్తాను." పగడం చెయ్యి చాస్తూ ప్రాధేయపూర్వకంగా అడిగింది.

శశికాంత్ చిన్నగా నవ్వాడు. "ఇప్పుడే కాదు. దీనిలోపల దాక్కున్న నిన్ను చీకటి గదిలో ఇవతలకి లాగాలి. స్నానం చేయించాలి. వేరే కాగితం మీద సింగారించాలి. అప్పుడు?"

చీకటి గది, స్నానం, సింగారం... పగడం బుగ్గల్ని పగడాల రంగులతో నింపాయి, పెదాల సందులో పళ్ళు మెరిశాయి. "అయితే.. ఆ పెట్టిలో... నేనున్నానా?"

"ఆ.." చక్కటి శుభ్రమైన దుస్తుల్లో, షాంపూ జుట్టుతో, అసలైన బుగ్గచుక్కతో ఆమెని తన ఊహానేత్రంలో చూస్తూ శశికాంత్ అన్నాడు.

"బాబూ...ఇందాక...అదే... కుక్కతో... నా బొమ్మెందుకు తీశారు?" ఏదో ఆలోచన వచ్చినట్టు పగడం అడిగింది.

శశికాంత్ చిన్నగా నవ్వాడు. "అది... ప్రత్యేకంగా తీశాను. ఒక పత్రిక, 'ఫోటోపోటీ' ఏర్పాటు చేసింది. స్వాభావికంగా – అంటే ఉన్నది ఉన్నట్టుగా, చక్కగా చూపించే ఫోటోకి పదివేల రూపాయలు బహుమతి ఇస్తారు. నేను తీసిన నీ బొమ్మకి పదివేలు వచ్చి తీరుతుంది. నాకు తెలుసు. కొన్ని వేల పుస్తకాల్లో ఆ ఫోటో వేస్తారు... తరువాత..

"అలాగా?"

"ఆ.. నీకూ చూపిస్తాగా? అన్నట్టు నీ పేరేంటి?"

"పగడం బాబూ, ఇప్పుడే ఒకసారి నా బొమ్మ చూసిత్తాను."

"చెప్పాగా? చీకటి గదిలో అంతా జరిగేక గానీ, నీకు నువ్వు కనపడవు!" శశికాంత్ నవ్వుతూ అన్నాడు.

"అయితే ఇందాక బాగా పడ్డానన్నారే! అది ఎట్టా కనిపించాను." పగడం అనుమానంగా చూస్తూ అడిగింది.

"కనిపించావు. అయితే నీకు నువ్వు కనబడవు. ఇందులోంచి నువ్వు చూస్తే నేను కనిపిస్తాను!" శశికాంత్ నవ్వుతూ అన్నాడు. "రేపు రా, నీ బొమ్మ ఇస్తాను."

పగడం గిన్నెని ఆదరాబాదరా చంకలో ఇరికించింది. "బాబూ బాబూ అందులోంచి ... ఓసారి... ఓసారి చూస్తాను."

పగడం ఉబలాటం శశికాంత్ కి జాలి కలిగించింది. వికారంగా ఉన్న ఏ ముసల్దో రాకుండా పగడం తన ఫోటో కోసం వచ్చింది.! అతను పట్టీని మెడ నుంచి తీశాడు. ఆమె దగ్గరగా జరిగాడు. "ఇదిగో... ఇలా పట్టుకుని, కన్ను ఈ అద్దానికి ఆన్చి, ఇలా చూడాలి. తెలిసిందా?" ఆఫ్ బటన్ నొక్కుతూ అన్నాడు.

పగడం తల ఆవేశంగా ఊగింది. వణికే చేతులతో కెమరాని పట్టుకుంది. కంటికి దగ్గరగా ఎత్తుకుంది. శశికాంత్ కొంచెం దూరంగా జరిగి, కేమరాలోంచి ఆమెకి అవుపించేలా నిలబడ్డాడు.

"కనిపిస్తున్నానా?"

"ఓ! భలేభలే!" పగడం ఉల్లాసంగా అరిచింది. మెల్లగా కెమేరాతోబాటు ఆమె తల పక్కకి తిరిగింది. చెత్తకుండి అంచు ఆమెకి కనిపిస్తోంది. పగడం తలా, కెమెరా కిందికి వాలాయి. చెత్తకుండీ పక్కగా పడుకున్న నల్ల కుక్క, దాని దగ్గరగా చిరిగిపోయిన పొట్లం కాగితం, అసంకల్పితంగా కెమెరా వెనుక పగడం పెదవులు వణికాయి.

"ఇలా ఇవ్వు. రేపు రా. నీ బొమ్మ చూపిస్తా!" శశికాంత్ అన్నాడు. పగడం చేతిలోంచి కెమెరా తటాలున కిందికి జారింది.
"అరెరే.. పడేస్తావ్!" కంగారుగా అరుస్తూ శశికాంత్ ముందుకు కదిలాడు.

కెమెరా కోసం చాపిన అతని చేతిని నిర్లక్ష్యం చేస్తూ పగడం రెండడుగులు వెనక్కి వేసింది. ఆమె కళ్ళు తదేకంగా, తీక్షణంగా శశికాంత్ కళ్ళలోకి చూసాయి. ఏదో కొత్త భావం, అద్దంబిళ్లలో సూర్యరశ్మిలా పగడం కళ్ళల్లో అవుపిస్తోంది శశికాంత్ కి.

*(ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక సౌజన్యంతో)*

“ఇదిగో… ఇలా ఇచ్చేయ్!” అప్రయత్నంగా అన్నాడు.

పగడం ఎర్రగా తయారవుతున్న కళ్ళని  అతని మొహంమీదే నిలిపింది.  ఆమె చెయ్యి మెల్లిగా కదిలింది. కెమెరా వడిసెలలా వేళ్ళాడుతూ ఊగింది.   శశికాంత్ ఆదుర్దాగా కదిలాడు. పగడం చంకలో గిన్నె కిందపడి చప్పుడు చేసింది. పగడం పెదవులు వణకసాగాయి.

పగడం చెయ్యి మెరుపుతీగలా కదిలింది. రాయిని దూరంగా, వేగంగా రువ్వుతున్న వడిసెలలా కెమెరా ముందుకి గోడవైపు దూకింది. మరుక్షణం భళ్ళున చప్పుడైంది. శశికాంత్ ఉలిక్కిపడ్డాడు. ఆపకుండా భళ్లు భళ్ళున పచ్చుడవుతూనే ఉంది. జరుగుతున్నదాన్ని కళ్ళతో ఫాలో కాలేకా, ఆపలేకా శశికాంత్ నిశ్చేష్టుడై  నిలబడిపోయాడు.

కోలుకుని అతను కదలడానికి రెండు క్షణాలు పట్టింది. పగడం చెయ్యి ఊగడం మానేసింది. తుక్కుతుక్కైపోయి కింది చెల్లాచెదురుగా పడున్న తన కెమెరాని శశికాంత్ కంగారుగా, బాధగా చూశాడు. తను పిచ్చిదాని చేతికి కెమెరా ఇచ్చాడా? ఆలోచిస్తూ శశికాంత్ ముందుకు గెంతాడు. ఆగ్రహంతో అతని పిడికెళ్ళు బిగుసుకున్నాయి.

“దొంగముండా!” శశికాంత్ హూంకరించాడు.

పచ్చడైపోయిన కెమెరాని తృప్తికరంగా చూస్తున్న పగడం తలని అతనివైపు తిప్పింది. శశికాంత్ లోని రోషాన్ని ఆమె కళ్ళలోని ఆగ్రహం ఎర్రగా వెక్కిరించింది. ఆమె రెండు చేతులూ పైకి లేచాయి. వేళ్ళు కొక్కేల్లా వంగాయి.

“దొంగముండా…కొడకా!” పళ్ళు కొరుకుతూ కసిగా, కసిగా, చిన్నగా అంది పగడం.

శశికాంత్ ఆగి నమ్మలేనట్టు చూశాడు.

“రారా! నా దరిద్రాన్ని ఆ పెట్టె కంటితో చూసిన నీ కళ్ళు పీకిపారేత్తాను!” పగడం బిగించిన పళ్ళ సందుల్లోంచి అంది.

పందేల్లో కోడిపుంజు కాళ్ళకి కట్టే వాడి కత్తుల్లా మెరుస్తున్న ఆమె పొడుగాటి గోళ్ళని ఆదుర్దాగా చూశాడతను. రూపం దాల్చిన కోపంలో ఉన్న పగడం మొహంలోకి, ముఖ్యంగా ఆ కళ్ళలోకి అప్రయత్నంగా చూశాడతను. ఆ కళ్ళలో ప్రతీకారం ఎర్రటి మంటలా అవుపిస్తోంది.
“నిన్ను…నిన్ను…” శశికాంత్ నత్తినత్తిగా అన్నాడు.

'అన్నం పొట్లంతో నాకూ, ఆ కుక్కకూ మధ్దిన పోటీ పెట్టి.. నీ ఫోటో కోసం... కుక్కతో నేను కాట్లాడేలా చేసినావ్, కుక్కా!" పగడం హూంకరించింది.

శశికాంత్ ఉరిమి చూశాడు. పగడం ఎర్రటి కళ్ళలో ఎదో మార్పు కెమెరా ఫ్లాష్ లా అవుపించిందతనికి. ఎర్రటి కాళ్ళమీద పల్చటి తెరలా నీళ్ళు కమ్మాయి. అదురుతున్న పెదవులు కదిలాయి.

"నీ లాంటి లుచ్చాలతో పోటీ పడలేక ఎంగిలికూడు అడుక్కుతింటున్న నాకు, కుక్కతో పోటీ పెడతావా?"

శశికాంత్ చూపులు మెల్లిగా కిందికి వాలాయి. కెమెరా శిధిల్లాలోంచి, ఎవరో చంపినా పాములా పడున్న ఫిల్మ్ దీనంగా అవుపించిందతనికి. ఫోటో...పోటీ...పదివేలు...ఫ్లాష్ లేకుండా చీకట్లో ఎక్స్ పోజ్ చేసిన ఫిల్మ్ ముక్కల్లా అతని కళ్ళకి అవుపిస్తున్నాయి. మెల్లిగా కళ్ళని పగడం వైపు లేపాడతను. అతని లోపల ఎదో మెల్లిగా కదుల్తోంది.

అగ్ని గోళాల్లా ఉన్న ఆమె కళ్ళనుండి జంట అగ్ని పర్వాతాల్నుంచి జారుతున్న వేడి లావా కాలువలా కన్నీళ్లు కిందికి జారాయి.

"కూటికి గతిలేని నా దరిద్రాన్ని బొమ్మ తీసి అమ్ముకోవాలని సూత్తున్నావ్... సిగ్గునేదు? ముదనష్టపోడా!" పగడం పిచ్చిదానిలా అరిచింది.

పగడం ఏడుపుతో అంటున్న మాటలు, ఆగ్రహంతో అంటున్న మాటలు అతని హృదయాన్ని వడిసెల దెబ్బల్లా తాకుతున్నాయి.
శశికాంత్ లో ఏదో, ఎందుకో బరువెక్కుతున్నట్టనిపించింది. కదలిక లేకుండా నిలుచున్న అతని కళ్ళలో ఏదో బలహీనత చొరబడుతోంది.

పగడం కదిలింది. హీనంగా చూస్తూ అతన్ని దాటి వెళ్ళిపోయింది. ఆమెని పిలవమనీ, క్షమాపణ చెప్పుకొమ్మనీ అతనిలోని మనిషి – పగడం వడిసెల దెబ్బలతో మేలుకొన్న మనిషి – మౌనంగా బొబ్బలు పెడుతున్నాడు. శశికాంత్ అతి ప్రయత్నం మీద నోరు తెరిచాడు. కానీ, ఎందుకో అతని ఆలోచనలు శబ్దంగా, మాటగా మారలేదు.

శశికాంత్ వెర్రివాడిలా కిందికి చూశాడు. పగడం చేతి కింది నుంచి జారిపడిన సత్తు గిన్నె వెడల్పాటి చిల్లుతో, ఒంటికంటితో అతన్ని ఆక్షేపణగా చూస్తోంది.

*(ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక సౌజన్యంతో)*

"దరిద్రాన్ని బొమ్మ తీసి అమ్ముకుని ఇంకా డబ్బు సంపాయించాలని సూతున్నావ్. ఉచ్చా!"

సత్తు గిన్నె నగారాలా పగడం మాటల్ని దండోరా వేస్తోందనిపించిందతనికి. శశికాంత్ తల పూర్తిగా కిందికి వాలింది. కాళ్ళు వణుకుతూ కదిలాయి.

(ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక సౌజన్యంతో)